క్లుప్తంగా

చిత్ర లేఖనంలో మేడపాడు విద్యార్థిని ప్రతిభ



జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షీల్డ్, సర్టిఫికెట్ అందుకుంటున్న ఆకుమర్తి శ్రీవర్షిణి

యలమంచిలి: సర్వోదయ మండలి సంస్థ గాంధీ జయంతి సందర్భంగా గాంధీ తత్వం–నేటి భారతం అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి ఆన్‌లైన్ డ్రాయింగ్ పోటీల జూనియర్స్ విభాగంలో మేడపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఆకుమర్తి శ్రీవర్షిణి ద్వితీయ స్థానం సాధించింది. భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం సర్వోదయ మండలి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా శ్రీవర్షిణికి షీల్డ్, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆకుమర్తి శ్రీవర్షిణిని, ఆమెకు శిక్షణ ఇచ్చిన పాఠశాల డ్రాయింగ్ టీచర్ అడ్డాల శివరామ కృష్ణంరాజును సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ దేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు డి.ప్రసాద్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

అల్లు రామలింగయ్యకు ఘన నివాళి



అల్లు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో నాటక రంగం నుంచి స్వయంకృషితో సినీ రంగానికి చేరుకొని పాలకొల్లు కీర్తిని నలుదిశలా వ్యాపింపచేసిన ఘనత సినీ నటుడు, పద్మశ్రీ దివంగత అల్లు రామలింగయ్యదేనని తులా రామలింగేశ్వరరావు అన్నారు. మంగళవారం అల్లు రామలింగయ్య 102వ జయంతి సందర్భంగా స్థానిక చిన్నకార్ల స్టాండ్ వద్ద ఉన్న కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శిడగం సురేంద్ర, బిట్రా లక్ష్మీనారాయణ, చేబ్రోలు కృష్ణమోహన్, కాపిశెట్టి పెదకాపు, మద్దాల గణేష్, ముచ్చర్ల శ్రీనివాస్, రమేష్, తిరుమాని రామకృష్ణ, కడలి స్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



తహసీల్దార్ సోమేశ్వరరావును కలసిన పుష్పరాజ్

పెనుగొండ: ఆచంట మండలంలో శ్మశాన వాటికలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, శ్మశాన వాటికలు లేని చోట స్థలం కేటాయించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ కోరారు. ఆచంట మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్వరరావును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్మశాన వాటికలతో పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిల్లే రాజ్‌కుమార్, కోలాటి ప్రసాదరావు, ఆచంట మండల ప్రధాన కార్యదర్శి బాబూ రాజేంద్రప్రసాద్, తరపట్ల జోషి పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో, ఈవోపీఆర్డీ

మొగల్తూరు: ప్రతీ నెల అందించే సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని 95.41 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి మంగళవారం తెలిపారు. మండలంలోని 10,662 పింఛన్‌దారులకు గాను 10,143 మందికి అందించామన్నారు. రామన్నపాలెం 1, 2, మొగల్తూరు 1వ సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్ పర్యవేక్షించారు.

చేనేతలను ఆదుకోవాలి

పెనుగొండ: రాష్ట్రంలో చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తగ్గించిన పట్టు చీరల గిట్టుబాటు ధరలు తిరిగి పెంచాలన్నారు. గతంలో మాదిరిగా మగ్గం, ఇతర పనిముట్లు 90 శాతం సబ్సీడీతో ఇవ్వాలన్నారు. అర్హత కలిగిన మగ్గం కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలని, ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. అదే విధంగా మగ్గం నేస్తున్న చేనేతలకు ముద్ర రుణాలు ఇవ్వాలని, నేత బజార్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.

దసరా మహోత్సవాలకు సర్వం సిద్ధం



వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం



ఉత్సవాలకు సిద్ధంగా ఉన్న అమ్మవార్ల విగ్రహాలు

- రేపటి నుంచి దసరా ఉత్సవాలు
- ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీలు

పెనుగొండ: దసరా ఉత్సవాల్లో రెండో మైసూరుగా పేరుగాంచిన పెనుగొండలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబరు 3వ తేదీ గురువారం నుంచి 12వ తేదీ వరకూ అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఊరూవాడా చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. మండలంలో పెనుగొండ, వడలి, సిద్ధాంతం గ్రామాల్లో వేడుకగా నిర్వహిస్తారు. చలువ పందిళ్లలో అమ్మవారి ప్రతిమలకు తొమ్మిది రోజులు పూజలు నిర్వహించి, అనంతరం నర్సాపురం కాలువలోనూ, సిద్ధాంతం వశిష్టా గోదావరిలోనూ నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంగా పెనుగొండలో దసరా వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఏనుగుల ఊరేగింపు నిర్వహిస్తారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చి వేడుకలను తిలకిస్తారు. దీంతో పెనుగొండ రెండో మైసూరుగా పేరుగాంచింది.

శ్రీనగరేశ్వర మహిషాసుర మర్దనీ ఆలయంలో

పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసుర మర్దనీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి గుబ్బల రామపెద్దింట్లురావు తెలిపారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ మహిషాసురమర్దనీ, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించనున్నట్లు వివరించారు. 3వ తేదీ గురువారం శ్రీబాల, 4వ తేదీ శుక్రవారం శ్రీరాజరాజేశ్వరి దేవిగా, 5వ తేదీ శనివారం శ్రీలలితా దేవిగా, 6వ తేదీ ఆదివారం శ్రీ అన్నపూర్ణాదేవిగాను, 7వ తేదీ సోమవారం శ్రీగాయత్రీ దేవిగాను, 8వ తేదీ మంగళవారం శ్రీలక్ష్మీ దేవిగాను, 9వ తేదీ బుధవారం శ్రీ సరస్వతీ దేవిగాను, 10వ తేదీ గురువారం శ్రీదుర్గా దేవిగాను, 11వ తేదీ శుక్రవారం మహిషాసుర మర్దనీదేవి గాను, 12 వ తేదీన నిజ రూపంలో అమ్మవారు దర్శనం ఇస్తారని తెలిపారు. తొమ్మిది రోజులు నిత్య పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీదేవి



వేడుకలకు తరలివెలుతున్న అమ్మవారి విగ్రహాలు

పాలకొల్లు సెంట్రల్: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీల సభ్యులు అమ్మవార్ల మండపాలను సిద్ధం చేస్తున్నారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు పది రోజులు నిర్వహిస్తారు. స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం బాలాత్రిపుర సుందరి, శుక్రవారం గాయత్రీదేవి, శనివారం అన్నపూర్ణాదేవి, ఆదివారం మహాలక్ష్మీదేవి, సోమవారం మహాచండీదేవి, మంగళవారం లలితా త్రిపుర సుందరీదేవి, బుధవారం సరస్వతీదేవి, గురువారం దుర్గాదేవి, శుక్రవారం మహిషా సురమర్దినీదేవి, శనివారం రాజరాజేశ్వరీదేవి, శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో, శ్రీ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారిని రోజుకో అలంకరణలో తీర్చిదిద్దనున్నారు. అంతే కాకుండా పట్టణంలో పలుకూడళ్లలో అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటుచేసి నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభించనున్నారు. మండపాల్లో విద్యుద్దీపాలకరణలు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాఠశాలలకు ఫర్నిచర్ వితరణ



సంధ్య మైరెన్స్ ఎండీ కె.ఆనందకుమార్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎంలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రు, లంకలకోడేరు, పూలపల్లి ఉన్నత పాఠశాలతో పాటు పోడూరు మండలం జిన్నూరు, పాలకొల్లు పట్టణంలోని ఎంఎంకేఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, బీఆర్ఎంవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు పూలపల్లి సంధ్య మెరైన్స్ ఎండీ కె.ఆనందకుమార్ రూ.6 లక్షల విలువైన ఫర్నిచర్ వితరణ చేశారు. దీంతో లంకలకోడేరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎండీ ఆనందకుమార్‌ను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, ప్రధానోపాధ్యాయులు శివజ్యోతి, బీఎస్ఎస్ఎల్ రాజు, ఆదినారాయణ, వివిధ పాఠశాలల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేపు పొలం పిలుస్తోంది

నరసాపురం రూరల్: మండలంలోని చినమామిడిపల్లి సచివాయం వద్ద గురువారం ఉదయం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏవో జాన్సన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చి రైతుల సమస్యలకు పరిష్కారాలు చూపుతారన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ జయంతి

పాలకొల్లు అర్బన్: మహాత్మాగాంధీ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని, గాంధీ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పేదల సామాజిక భద్రతకే పింఛన్ల పంపిణీ



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

పాలకొల్లు సెంట్రల్: పేద ప్రజల సామాజిక భద్రత కోసమే రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లను పెంచి పెద్ద మొత్తంలో పంపిణీ చేస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పాలకొల్లు పట్టణంలోని 9వ వార్డులో వృద్ధురాలికి పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా జెసి రాహుల్‌కుమార్ రెడ్డి ప్రతీనెలా ఒకటో తేదీన పెన్షన్లు అందుతున్నాయా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెన్షన్ల పంపిణీలో ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుని పంపిణీ చేయాలని మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు.

రేషన్ షాపు, ఎండీయూ వాహనం తనిఖీ

రేషన్ సరుకుల పంపిణీ, తూనికలు, కొలతల్లో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా క్షమించేది లేదని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆపరేటర్‌ను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఎండీయూ వాహనం, రేషన్ షాపు, ఎలక్ట్రానిక్ కాటాలు, స్టాక్ బోర్డు రికార్డులు అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, టీపీవో వీరబ్రహ్మం, సీఎస్ డీటీ సత్యనారాయణ, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మీ పెద్దిరాజు

పెనుగొండ: స్వచ్ఛతా హీ సేవ–2024లో భాగంగా వడలిలో పారిశుద్ధ్య కార్మికులను సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గ్రామాభివృద్ధికి, ఆరోగ్యాభివృద్ధికి పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పీపీ రామకృష్ణ, మేకా శివయ్య, నాయకులు ఉప్పలపాటి చంటి, గణపతి నీడి బుల్లియ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

విద్యుత్ ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం



కుంచిలపల్లి విన్‌స్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: ఆర్టీసీ, విద్యుత్‌తో పాటు ఎటువంటి పన్నుల భారం మోపమని చంద్రబాబు ఎన్నికల ముందు ప్రచార సభలో హామీ ఇచ్చారని, వెంటనే ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి విన్‌స్టన్‌బాబు విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలో విద్యుత్ ఛార్జీలు పెంచడానికి రంగం సిద్ధం చేశారన్నారు. విద్యుత్ వినియోగదారులపై యూనిట్‌కి రూ.4.14 నుంచి రూ.6.69 వరకు అదనపు భారం మోపబోతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ ఛార్జీలు పెంచారని తాము అధికారంలోకి వస్తే పన్నుల భారం మోపమని హామీ ఇచ్చి, ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని మోసం చేశారన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి ప్రజలపై పన్నుల రూపంలో ఆదాయం రాబడుతున్నారని దుయ్యబట్టారు.

చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ప్రతీ విద్యార్థిని చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఏఎస్సై సీహెచ్ సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని శివదేవుని చిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బేటీ బచావో– బేటీ పఢావో, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతీ విద్యార్థిని క్రమ శిక్షణతో మెలగాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రేమ పేరుతో ఎవరైనా లైంగిక వేధింపులకు గురి చేస్తే పోలీసులకు సమాచారమివ్వాలని ఏఎస్సై సత్యనారాయణ మూర్తి కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఉపాధ్యాయులు వీఎస్ఎన్ మూర్తి, జి.శాస్త్రి, వీకే కనకదుర్గ, గంగా మహేష్ నాయుడు, ఏఎన్ఎం కె.సుశీల, ఎంఎల్‌హెచ్‌పీ పి.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.సత్యశ్రీ, విజయకుమారి, కుసుమరాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో స్వర్ణాంధ్ర-2047



స్వర్ణాంధ్ర-2047పై ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: 2047 నాటికి భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తకానున్న కారణంగా స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి తీసుకోవలసిన చర్యలపై ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ వివరించారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర–2047 కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఎస్సే రైటింగ్, డిబేట్ పోటీలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా టి.కృష్ణ మాట్లాడుతూ దేశ ప్రగతిని, రాష్ట్ర ప్రగతిని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి స్వచ్ఛతా పరిశుభ్రత, గ్రామీణాభివృద్ధి, శాస్త్ర సాంకేతికత కలిసిన రాష్ట్రంగా పురోభివృద్ధి సాధించడానికి నడుం బిగించాలన్నారు. వీటిని సూక్ష్మ, మధ్య, దీర్ఘ కాలిక లక్ష్యాలుగా ఏర్పాటు చేసుకొని ఈ–ప్రగతిని సాధించాలన్నారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పబ్లిక్ సూచనలు, సలహాలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు డాక్టర్ వి.యామిని, ఎం.రామకృష్ణ, వి.వి జయలక్ష్మి, పద్మలత, బి.రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో స్టడీ క్యాంపు

పెనుగొండ: సీపీఎం జిల్లా స్థాయి అధ్యయన శిబిరం అక్టోబర్ 2 నుంచి 4 వరకూ సిద్ధాంతంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోపాలన్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సిద్ధాంతంలోని ఆర్కే కల్యాణ మండపంలో నిర్వహిస్తారన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం అధ్యయన శిబిరంలో రాష్ట్ర నాయకులు ఎం.సీతారాం, అరుణ్, జిల్లా కార్యదర్శి బి.బలరాం పాల్గొంటారన్నారు. ప్రజల సహాయ సహకారాలతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, సిద్ధాంతం కార్యదర్శి కె.రత్నరాజు పాల్గొన్నారు.

గాయపరచిన వ్యక్తిపై కేసు

భీమవరం అర్బన్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అన్యాయంగా కొట్టి గాయపరిచారని వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన తాళ్లూరి దినేష్‌ను గత నెల 29న అదే గ్రామానికి చెందిన తాళ్లూరి ఆనందబాబు, తాళ్లూరి జెస్సీ కొట్టి గాయపరిచారు. బాధితుడు తాళ్లూరి దినేష్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి గడ్డి మందు తాగి చనిపోయాడని భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నరసయ్య అగ్రహారానికి చెందిన కవాలి మణికంఠ(32) కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో సోమవారం పట్టణంలోని లెప్రసీకాలనీ వద్ద గడ్డి మందు తాగడంతో చికిత్స కోసం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రామకృష్ణ తెలిపారు.

రోగికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న వసుధ ఫౌండేషన్ కన్వీనర్

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రుకు చెందిన బత్తిన సత్య వరప్రసాద్ వెన్నుపూస విరిగి మంచానికే పరిమితమయ్యారు. దీంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయాన్ని స్థానికులు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి రూ.10 వేల ఆర్థిక సహాయం చెక్కును మంగళవారం ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా రోగికి అందజేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

యలమంచిలి: అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన యన్నాబత్తుల నరసింహమూర్తి (47) కనిపించడం లేదని అతని చిన్నాన్న కుమారుడు యన్నాబత్తుల లక్ష్మణకుమార్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్టీడి గురయ్య తెలిపారు. నరసింహమూర్తికి కొంత కాలంగా మానసిక స్థితి బాగా లేదని, ఈ క్రమంలోనే ఈ నెల 20న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి నుంచి తిరిగి రాలేదని, దీంతో బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

సార్వా సాగుకు ఎలుకల ముప్పు

సామూహిక ఎలుకల నివారణ మేలంటున్న వ్యవసాయాధికారులు



కొప్పర్రులో ఎలుకల బుట్టలు వేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: వ్యవసాయ రంగాన్ని చీడపీడలు వార్షికంగా వెంటాడుతున్నాయి. ఈ నష్టం బారి నుంచి రైతు తనను తాను కాపాడుకోలేక ఇబ్బంది పడుతున్నాడు. ముఖ్యంగా ఎలుకల బెడద సార్వాలోనూ, దాళ్వాలోనూ నిరంతరాయంగా వేధిస్తోంది. ఎలుకలను నివారించడానికి ప్రభుత్వం సామూహికంగా తీసుకునే చర్యలు తూతూ మంత్రంగానే ఉంటున్నాయి. శాస్త్రీయ పద్ధతిలో ఎలుకలను నివారిస్తే తప్ప దీనికి మార్గం లేదనే విషయం వ్యవసాయ శాస్త్రవేత్తలకు, ప్రభుత్వ వ్యవసాయ సాంకేతిక యంత్రాంగానికి తెలిసినప్పటికీ తగిన చర్యలు లేవనే చెప్పాలి. ఒక సంవత్సర కాలంలో భారత దేశంలో ఎలుకలు చేసే పంట నష్టం లెక్కిస్తే ఒక రోజు ప్రపంచ జనాభా ఆకలి తీర్చొచ్చని అంచనా. ఎలుకల వల్ల జరిగే నష్టం ఈ స్థాయిలో ఉన్నప్పటికీ ఎలుకల నివారణకు తగు చర్యలు చేపట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విషయం చెప్పక తప్పదు. ప్రస్తుతం సార్వా సీజన్‌లో పొలంలో ఎలుకలు, పందికొక్కులు చేస్తున్న నష్టంతో రైతులు కుదేలవుతున్నారు. నారు వేసింది మొదలు పిలకలు, చిరుపొట్ట, ఈనిక, కోత దశల్లో కూడా పంటను ఎలుకలు ధ్వంసం చేస్తున్నాయి. రైతులు నిత్యం ఎలుకలకు బోన్లు వేయిస్తూ ఎరలు పెడుతూ ఎవరి కష్టం వారు పడుతున్నప్పటికీ నివారణ సాధ్యం కావడం లేదు. రైతులు ఎలుకల నివారణపై అవగాహన పెంచుకొని సామూహికంగా మందు పెట్టడం, బోన్లు వేయించడం చేస్తే నష్టం తగ్గుతుంది. ఈ బాధ్యతను వ్యవసాయాధికారులు చేపట్టాలి. అయితే వారికి అంత తీరిక లేనట్లుంది. రైతాంగాన్ని చైతన్యం పరచడంలో వ్యవసాయ శాఖ పూర్తిగా విఫలమైందని తేట తెల్లమవుతోంది. ఎలుకల నివారణ బాధ్యత కేవలం వ్యవసాయ శాఖ వారికే అనుకోవడం పొరపాటు. ఇళ్లల్లోనూ, కర్మాగారాల్లోనూ, గోదాముల్లోనూ, రైల్వే, ఓడరేవులు, విమానాశ్రయాలు అన్ని శాఖలూ, అన్ని రంగాలూ చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించినప్పటికీ అమలులో మాత్రం చర్యలు శూన్యం. ప్రస్తుతం పిలక దశలో ఉన్న పంటకు ఎలుకలు తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయి. రైతాంగం పైరు మొదట్లో ఎక్కువ నీరు నిలిచేలా చర్యలు తీసుకుంటే నష్టం తక్కువగా ఉంటుంది. పొలంలో తడి ఆరిపోతే నష్టం ఎక్కువగా ఉంటుంది. ఈ విషయాన్ని గ్రహించి రైతులు జాగ్రత్త పడాలి. ఎలుకల వల్ల పైరుకు చిరుపొట్ట, పొట్ట దశల్లో నష్టం తీవ్రంగా ఉంటోంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ రైతులు ఎలుక నష్టాన్ని అధిగమించాల్సిన అవసరం ఉంది.

సాగు విస్తీర్ణం

మండలం	ఎకరాలు
నరసాపురం	3350 ఎకరాలు
మొగల్తూరు	520 ఎకరాలు
యలమంచిలి	3600 ఎకరాలు

వ్యవసాయ శాఖను సంప్రదించాలి



రైతులు సామూహిక ఎలుకల నివారణను చేపట్టాలి. దీని కోసం ప్రభుత్వం ఉచితంగా అందించే ఎలుకల నివారణ మందును సద్వినియోగం చేసుకొని ఎలుకల నివారణ చేసుకోవాలి. ఏదైనా అవసరమైతే రైతులు వ్యవశాఖ సిబ్బందిని సంప్రదించవచ్చు.

– జాన్సన్, వ్యవసాయశాఖ అధికారి